Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

శుక్రవారం
4 అక్టోబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 148
పేజీలు : 6
వెల : 3/-

శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

జైలు ఖైదీల్లో కులవివక్ష సరికాదు

- జైళ్లలో కుల వివక్షపై సుప్రీం కోర్టు చారిత్రక తీర్పు
- అన్ని కులాలకు చెందిన ఖైదీలను మానవత్వంతో, సమానంగా చూడాలి
- పని విషయంలో సమాన హక్కు కల్పించాలి
- షెడ్యూల్డ్ కులాల ఖైదీలకే క్లీనింగ్ పనులు అప్పగించడం విస్మయం కలిగిస్తోంది

బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఒప్పందాలు జరిగాయి

- బీఆర్ఎస్, బీజేపీపై మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు..
- అందుకే ఆమె బెయిల్‌పై బయటకు వచ్చారు
- ప్రజలకు ఏ విధంగా సేవ చేయాలా అని మేము చూస్తుంటే.. బీఆర్ఎస్ పార్టీ మాత్రం ప్రజలను తప్పు దారి పట్టిస్తోంది
- సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు, రాతలు రాపిస్తూ కేటీఆర్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు

రైతులను మోసగిస్తే కఠిన చర్యలు

- సన్నాల పేరిట గోల్ మాల్ కట్టడి..
- కలెక్టర్లు.. ఎస్పీలతో సీఎం రేవంత్ వీడియో కాన్ఫరెన్స్
- ఈ సీజన్ నుంచే సన్నాలకు ఎమ్మెస్పీకి అదనంగా ఒక్కో క్వింటాలుకు రూ.500 బోనస్
- గత సీజన్ లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు మూడు రోజుల్లో డబ్బులు ఇచ్చాం
- ఈసారి 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది

-3లో

చెంచులు.. గిరిజనులకు మెరుగైన వైద్యం కోసం చర్యలు

- అధికారులకు మంత్రి రాజ నర్సింహా ఆదేశం..!
- ప్రతి చెంచు పెంట, గిరిజన గూడెంలో నివసించే ప్రతి వ్యక్తికి మెరుగైన వైద్యం అందేలా కార్యాచరణను రూపొందించాలి
- అటవీ ప్రాంతంలో 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

-3లో

హెచ్‌సీఏలో 20 కోట్ల ఫ్రాడ్

- అజారుద్దీన్‌కు ఈడీ సమన్లు
- 2020 నుంచి 2023 వరకు హెచ్‌సీఏలో జరిగిన అక్రమాలపై ఉప్పల్ పోలీస్ స్టేషన్లో పలు ఫిర్యాదులు
- కాంగ్రెస్ నాయకుడికి దర్యాప్తు సంస్థ సమన్లు పంపడం ఇదే మొదటిసారి.

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు

- గుర్తింపు కార్డు ద్వారానే ఇందిరమ్మ ఇళ్లు , పింఛన్లు ప్రభుత్వ పథకాలు అన్ని డిజిటల్ కార్డు ద్వారానే వస్తాయి

శుభ తెలంగాణ కరీంనగర్

రాష్ట్రంలో ఆధార్ కార్డు వలె ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రవాణా మరియు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు లో భాగంగా గురువారం కరీంనగర్ నియోజకవర్గంలో తహేర్ కొండాపూర్ లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు నమోదు కార్యక్రమాన్ని రవాణా మరియు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. స్వయంగా తాహేర్ కొండాపూర్ గ్రామంలో పలు నివాసాలకు వెళ్లి వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ నమోదు చేశారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులో కుటుంబ సభ్యుల సంఖ్య గుర్తింపు ఫోటో తదితర వాటి వివరాలు సేకరణ - మిగతా3లో

ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలం..

సీఐలు, ఎస్ఐలపై వేటు వేసిన ఐజీ..!

శుభ తెలంగాణ హైదరాబాద్

మల్టీజోన్-2లోని తొమ్మిది జిల్లాల పరిధిలో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమైన పోలీసులపై ఐజీ వీ సత్యనారాయణ చర్యలు చేపట్టారు. ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలను వీఆర్‌లో పెడుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఓ సీఐ, 14 మంది ఎస్ఐలను బదిలీ చేశారు. తాజాగా సంగారెడ్డి రూరల్, తాండూరు రూరల్,

ఎమ్మెల్యే అనర్హత వేటు.. స్టే ఇచ్చేందుకు నిరాకరణ

- తెలంగాణ హైకోర్టు మరో కీలక నిర్ణయం
- సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలన్న అసెంబ్లీ సెక్రటరీ అభ్యర్థనను తిరస్కరించిన హైకోర్టు డివిజన్ బెంచ్
- నెల రోజులు క్రితం సెప్టెంబర్ 9న విచారణ సందర్భంగా అసెంబ్లీ సెక్రటరీకి, స్పీకర్‌కు సూచనలు చేసింది
- నెల రోజుల్లో నిర్ణయం తీసుకొని షెడ్యూల్‌ను బెంచ్ ముందు ఉంచాలని ఆదేశించింది.
- తదుపరి వాదనలు 24న వింటామన్న కోర్టు

శుభ తెలంగాణ హైదరాబాద్

తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు మరో కీలక పరిణామం జరిగింది. గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలన్న అసెంబ్లీ సెక్రటరీ అభ్యర్థనను హైకోర్టు డివిజన్ బెంచ్ తిరస్కరించింది. స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ విషయంపై ఈనెల 24న వాదనలను వింటామని తెలిపింది. బీఆర్ఎస్ పార్టీ తరపున విజయం సాధించి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సహా పలువురు వేసిన పిటిషన్ హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. నెల రోజులు క్రితం సెప్టెంబర్ 9న విచారణ - మిగతా3లో



మార్పు మార్పు అంటూ కాంగ్రెస్ మోసం చేసింది

- పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం.. పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం
- పత్రికలో వచ్చిన కథనాన్ని ట్వీట్‌కు జత చేసిన కేటీఆర్
- అనుభవరాహిత్యం వల్లే ప్రభుత్వ ఆదాయం పడిపోతోందన్న కేటీఆర్
- సంపదను సృష్టించి పేదలకు పంచే తెలివి సీఎంకు లేకపోవడమే సమస్య అని వ్యాఖ్య

-3లో

హైబాక్స్ సిండికేట్ కేసులో ఐదుగురికి సమన్లు జారీ చేసిన పోలీసులు

హైబాక్స్ మొబైల్ అప్లికేషన్ ద్వారా భారీగా పెట్టుబడి పెట్టడంతో పలువురు తీవ్రంగా నష్టపోయిన ఘటనలో దేశ రాజధాని న్యూఢిల్లీ పోలీసులు గురువారం చర్యలకు ఉపక్రమించారు. ఈ యాప్‌తో పెట్టుబడులు పెట్టాలంటూ సోషల్ మీడియా ద్వారా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపిన ఐదుగురు ప్రముఖ వ్యక్తులకు పోలీసులు సమన్లు జారీ చేశారు. ఈ సమన్లు జారీ చేసిన వారిలో.. ఎల్‌విష్ యాదవ్, భారతీ సింగ్ తదితరులు సైతం ఉన్నారు. ఈ మొబైల్ యాప్ ద్వారా దాదాపు రూ. 500 కోట్లు మేర పెట్టుబడి పెట్టి ప్రజలు నష్టపోయారు. పెట్టుబడులు పెట్టే సమయంలో మీ పెట్టుబడులను తిరిగి ఇస్తామని వారు నమ్మించారు. కానీ పెట్టుబడి పెట్టిన నగదును మాత్రం వారు అక్రమ కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు ప్రజలు గుర్తించారు. ఆ క్రమంలో వారు ఢిల్లీ పోలీసులను ఆశ్రయించారు. దీంతో

పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. ఈ యాప్ ద్వారా పెట్టుబడులు పెట్టాలంటూ ప్రజలపై వీరు తీవ్ర ప్రభావం చూపించారు. దీంతో ఈ కేసు విచారణలో భాగంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులోభాగంగా వీరికి సమన్లు జారీ చేశారు. ఈ యాప్‌పై దాదాపు ఐదు వందల మంది ఫిర్యాదు చేశారని పోలీసు ఉన్నతాధికారి వెల్లడించారు. వీరి ప్రచారం కారణంగా దాదాపు 30 వేల మంది నష్టపోయారని తెలిపారు. ఈ కేసులో బాధితులుగా మారిన వారంతా యూట్యూబర్‌లు, ఇన్‌ఫ్లుయెన్సర్‌ల ద్వారా ఈ యాప్‌కు పరిచయమైనవారేనని స్పష్టం చేశారు. అలాగే ఆ యా ప్రముఖలకు చెందిన లక్షలాది మంది అనుచరులు సైతం ఈ యాప్‌కు ప్రచారం చేశారని వివరించారు. ఈ నేపథ్యంలో యూట్యూబర్లు, అభిషేక్ మల్హన్, ఎల్విష్ యాదవ్, లక్షయ్ చౌదరి, పురవ్ ఝూతోపాటు భారతీ సింగ్‌కు సమన్లు జారీ చేశామన్నారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని వాంగ్మూలం ఇవ్వాలని వారికి జారీ చేసిన సమన్లలో స్పష్టం చేసినట్లు పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు.

ఈషా ఫౌండేషన్‌పై హైకోర్టుకు నివేదిక

కోయంబత్తూరు : ఈషా ఫౌండేషన్.. ఆధ్యాత్మిక భావాలు ఉన్న హిందువే కాదు. వివిధ మతాలవారు, విదేశీయులకు కూడా ఈ ఫౌండేషన్ గురించి తెలుసు. తమిళనాడులోని ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగాతోపాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈషా ఫౌండేషన్ 1992లో ప్రారంభమైంది. ఎలాంటి లాభాపేక్ష లేని ఆధ్యాత్మిక సంస్థ. తమిళనాడులోని కోయంబత్తూరు సమీపంలో సద్గురు(జగదీష్ వాసుదేవ్) దీనిని స్థాపించారు. ఈషా యోగా కేంద్రాన్ని, ఆధ్యాత్మిక కేంద్రాన్ని నిర్వహిస్తుంది. పూర్తిగా వలంటీర్లే దీనిని నిర్వహిస్తున్నారు. నీలగిరి పర్వతాలలో భాగమైన వెల్లియంగిరి శ్రేణిలో 150 ఎకరాల స్థలంలో దట్టమైన అడవులు, ప్రత్యేకమైన వన్యప్రాణుల అభయారణ్యంతో ఉంది. ఇది ప్రఖ్యాత శక్తి కేంద్రం భక్తి, జ్ఞానోదయం, కర్మ, క్రియ వంటి యోగా అన్ని విభాగాలను ఒకే గొడుగు క్రింద అందించడం, గురు?శిష్య సంప్రదాయాన్ని పునరుద్ధరించడం ద్వారా ప్రపంచం నలుమూలల నుంచి ప్రజలను ఆకర్షిస్తుంది.ఇదిలా ఉంటే.. ఈషా ఫౌండేన్‌లో అన్నింటికీ ఫీజే. నిస్వార్థ సేవ అని సంస్థ చెబుతన్నా.. ఉచితంగా ఇక్కడ ఎలాంటి సేవలు పొందలేరు. ప్రతీ సేవకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందుకు డబ్బులు చెల్లించాలి. సెలబ్రిటీలను ఫౌండేషన్‌కు తీసుకువచ్చి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రచారం పొందుతోంది. తద్వారా ప్రతీదానికి డబ్బులు వసూలు చేస్తోంది. సినిమా నటులు, క్రీడాకారులు, విదేశీయులు ఇలా వేర్వేరు రంగాలకు చెందిన వారు ఫౌండేషన్‌ను సందర్శించిన ఫొటోలు, అక్కడ వారు మాట్లాడిన మాటలను ఈషా వెబ్‌సైట్‌లో ఉంచడం ద్వారా కొత్తవారిని ఆకట్టుకుంటోంది. శివరాత్రికి నిర్వహించే జాగరణ కార్యక్రమానికి పెద్దపెద్ద



సెలబ్రిటీలను పిలిచి దానిని కూడా ప్రచారానికి వాడుకుంటున్నారు.ఇక సద్గురు జగదీష్ వాసుదేవ్ పాదాల ఫొటోలను కూడా ఈషా ఫౌండేషన్ విక్రయిస్తోంది. ఒక ఫొటో ఖరీదు రూ.3,200గా ఉంది. ఈమేకు ఈ ఫొటో దాని ధర వివరాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈషా ఫౌండేషన్ ఆన్‌లైన్ షాప్‌లో కూడా ఈ ఫొటో ఉంది. దీనిపై చాలా మంది వివిధ రకాల కామెంట్స్ చేస్తున్నారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన సద్గురు పాదాలను విక్రయిస్తూ 'గురువు పాదాలకు నమస్కరించడం అనేది మంచిది. గురువుతో లోతైన బంధాన్ని ఏర్పరుస్తుంది' అని ఈషా ఆన్‌లైన్ షాప్‌లో రాశారు. అయితే దీనిపై కొందరు విమర్శలు చేస్తున్నారు. మరికొందరు నవ్వుకుంటున్నారు. ఇదిలా ఉంటే కోయంబత్తూర్‌లోని తొండముత్తూర్‌లోని ఈషా ఫౌండేషన్ ఆశ్రమంలో 150 మంది పోలీసులు తనిఖీలు చేశారు. ఇద్దరు యువతులను నిర్బంధించారనే ఆరోపణలపై కోర్టు ఆదేశాలమేరకు పోలీసులు తనిఖీలు చేశారు. మరోవైపు ఈషా ఫౌండేషన్‌పై నమోదైన కేసులపై హైకోర్టు నివేదిక కోరింది.

దీపావళికి మేకిన్ ఇండియా

న్యూఢిల్లీ : బతుకమ్మ మొదలైంది. ఈ ప్రకారం పండుగల సీజన్ ప్రారంభమైనట్టే. ఈ నవరాత్రి వేడుకలను దేశవ్యాప్తంగా జరుపుకుంటారు. ఒక్కో ప్రాంతంలో తక్కువ తీరుగా నిర్వహిస్తుంటారు. దసరా, దీపావళి, చాట్ పూజలతో భారతదేశం మొత్తం పండగ వాతావరణం నెలకొంటుంది. అయితే ఈ పండగలవేళ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల మన్ కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలకమైన వ్యాఖ్యలు చేశారు. మనం నిర్వహించుకునే పండుగలకు.. మనం తయారు చేసే వస్తువులను మాత్రమే వాడాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. అయితే మోడీ చేసిన వ్యాఖ్యలను జాగ్రత్తగా పరిశీలిస్తే.. అవి చైనాకు చెక్ పెట్టేలాగా ఉన్నాయని తెలుస్తోంది.. త్వరలో జరుపుకోబోయే దీపావళి పండుగను మేడ్ ఇన్ ఇండియా వస్తువులతోనే నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఇటీవల గణేష్ నవరాత్రి ఉత్సవాలలోనూ దేశీయంగా తయారైన వస్తువులనే మెజారిటీ ప్రజలు వాడారు. దీంతో చైనా నుంచి దిగుమతి అయ్యే వివిధ రకాల వస్తువులు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి. దాన్ని మర్చిపోకముందే నరేంద్ర మోడీ దీపావళి పండుగకు సంబంధించి ఉపయోగించే ప్రమిదల నుంచి మిఠాయిల వరకు స్థానికంగా తయారైనవి మాత్రమే వినియోగించాలని సూచించారు. వాస్తవానికి మనదేశంలో పండగల సమయంలో చైనా దేశం నుంచి విచ్చలవిడిగా వస్తువులు మార్కెట్లో దర్శనమిస్తాయి. ఆ వస్తువులు అత్యంత తక్కువ ధరలో లభిస్తాయి. వాటి వల్ల స్థానికంగా ఉన్న తయారీదారులకు ఉపాధి కరవుతుంది.. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా మేడిన్ ఇండియాకు, మేక్ ఇన్ ఇండియాకు భారత ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.

ఇందులో భాగంగా చైనా వస్తువులపై అనధికార నిషేధం విధించింది. లోకల్ మేడ్ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించింది. నేరుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్థానికంగా ఉన్న ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని పిలుపునివ్వడం మొదలుపెట్టారు. వోకల్ ఫర్ లోకల్ అనే నినాదాన్ని ఆయన తెరపైకి తీసుకొచ్చారు.ఇక గత ఏడాది లాగానే ఈ ఏడాది కూడా మేకింగ్ ఇండియా ఉత్పత్తులను వాడాలని మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. గత కొంతకాలంగా భారత్ ? చైనా మధ్య వాణిజ్య ఒప్పందాలు అనేక సంక్లిష్టతల మధ్య సాగుతున్నాయి. ఈ క్రమంలో పండుగ సమయంలో మన దేశంలో తయారైన ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని నరేంద్ర మోడీ పిలుపునిస్తున్నారు. ఫలితంగా స్థానికంగా ఉత్పత్తుల తయారీ పెరిగింది. వ్యాపారులకు లాభాలు వస్తున్నాయి . ఈ సంవత్సరం రక్షాబంధన్ పండుగ సమయంలో స్థానికంగా తయారైన రాఖీలను మాత్రమే ప్రజలు కొనుగోలు చేశారని ది కాన్ఫిడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ ప్రకటించింది. చాలా సంవత్సరాలుగా మనదేశంలో తయారైన రాఖీలు మాత్రమే అమ్ముడవుతున్నాయని వారు పేర్కొన్నారు. దీనివల్ల చైనా నుంచి దిగుమతి అయిన రాఖీలకు ప్రతిగా డిమాండ్ లేదని ఆ సంస్థ ప్రకటించింది. గత ఏడాది దీపాలు సమయంలో స్థానికంగా తయారైన దీపాలకు డిమాండ్ పెరిగిందని.. గత కొంతకాలంగా మార్కెట్లో గట్టి పోటీ ఇస్తున్న చైనా కంపెనీలకు.. భారత కంపెనీల ఉత్పత్తులు గట్టి పోటీనిస్తున్నాయని వారు వివరించారు.. తక్కువ ధర వల్ల చైనా ఉత్పత్తులు ప్రజల ఆదరణ పొందినప్పటికీ.. అవి నాణ్యంగా లేకపోవడంతో తిరిగి ప్రజలు దేశీయ ఉత్పత్తులను ఆదరించడం మొదలు పెడుతున్నారని వ్యాపారులు అంటున్నారు. పైపులైట్ స్ట్రింగ్స్, బ్యాటరీ తో నడిచే దయాలైట్, ఎల్ఈడి లైట్.. ఫ్లవర్ లైట్.. గోల్డెన్ లైట్ వంటి వస్తువులను భారతీయ కంపెనీలు విరివిగా తయారుచేస్తున్నాయి. వాటిని మన దేశ ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. ఇదే సమయంలో చైనా కంపెనీలు కూడా అలాంటి ఉత్పత్తులను తయారు చేస్తున్నప్పటికీ.. ప్రజలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించడం లేదని వ్యాపారులు అంటున్నారు.

ఆ ముగ్గురు మంత్రుల భేటీ వెనుక ఉన్న మతలబు ఏమిటో...

బెంగళూరు: ముడా వివాదంలో సీఎం సిద్దరామయ్యకు కేసుల కష్టాలు బిగుసుకుంటున్న తరుణంలో మంత్రుల రహస్యభేటీ కాంగ్రెస్?లో కలకలం రేపుతోంది. కారణాలు ఏవైనా రహస్యంగా సమావేశం కావడం పలువురు మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులను విస్మయం కలిగిస్తోంది. బీజేపీ-జేడీఎస్ నాయకులు ముఖ్యమంత్రితోపాటు కాంగ్రెస్ పార్టీకి తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నా వాటి గురించి ఒకరిద్దరు తప్ప మంత్రులెవరూ నోరు మెదపడం లేదు. మరోవైపు రహస్య సమావేశాల వెనుక భారీ అజెండానే ఉన్నట్టు తెలుస్తోంది. తాజాగా మంగళవారం రాత్రి హోం మంత్రి పరమేశ్వర్, [redacted]ంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళిలు భేటీ అయ్యారు. వీరు ప్రస్తుతం కేబినెట్‌లో కీలకమైన మంత్రులు. ఇప్పటికే పరమేశ్వర్ తాను సీఎం రేసులో ఉన్నానని దాదాపు నిరూపించుకున్నారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీతో ప్రత్యేక సమావేశం కావడం, సదరు విషయాలను బహిరంగంగా చెప్పలేనంటూ ప్రకటించారు. మరోవైపు సతీశ్‌జార్కిహొళి ఆగస్టు రెండోవారం తర్వాత నుంచి సెప్టెంబరు రెండోవారం దాకా నాలుగైదుసార్లు ఢిల్లీకి వెళ్లొచ్చారు. ప్రతిసారి పరమేశ్వర్‌తో చర్చలు జరిపాకనే జార్కిహొళి ఢిల్లీ వెళ్లి వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల హోం మంత్రి పరమేశ్వర్, డీసీఎం డీకే శివకుమార్‌లు ప్రత్యేకంగా భేటీ అయిన విషయం మరువకముం[redacted] ముగ్గురు మంత్రుల కలయిక కాంగ్రెసలో కుతూహలం రేకెత్తిస్తోంది. దళిత ముఖ్యమంత్రి అంశం అప్పుడప్పుడు తెరపైకి వస్తున్న విషయం తెలిసిందే. మంత్రి మహదేవప్ప ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అత్యంత ఆప్తుడనే విషయం తెలిసిందే. సిద్దరామయ్యను వీడి మహదేవప్ప రాజకీయం చేసే ఆలోచన లేదనేది ఇప్పటివరకు సాగింది. అయితే సీఎం సిద్దరామయ్యపై లోకాయుక్త విచారణకు ముందే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా రంగంలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. లోకాయుక్త కంటే ముందే సిద్దరామయ్యను ఈడీ విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఆదివారం ముడా వివాదంలో ఫిర్యాదుదారుడు స్నేహమయికృష్ణకు ఈడీ [redacted]నోటీసులు ఇచ్చింది.

హెచ్‌సీఏలో 20 కోట్ల ఫ్రాడ్..

హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘంతో లింకున్న మనీల్యాండరింగ్ కేసులో.. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు ఇవాళ ఈడీ నోటీసులు జారీ చేసింది. 2020 నుంచి 2023 వరకు హెచ్‌సీఏలో జరిగిన అక్రమాలపై ఉప్పల్ పోలీస్ స్టేషన్లో పలు ఫిర్యాదులు ఉన్నాయి. ఆ సమయంలో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజార్ పనిచేశారు. క్రికెట్ బాల్స్, బకెట్ చైర్స్, జిమ్ పరికరాలకు కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉప్పల్లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈసీఆర్ నమోదు చేసింది ఈడి. ఈ విషయం ఇప్పటికే అజారుద్దీన్ బెయిల్ పొందారు. అయితే తాజాగా విచారణ చేపట్టాలని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, మాజీ ఎంపీ, ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన అజారుద్దీన్.. గురువారం ఈడీ ముందు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌సీఏలో 20 కోట్ల మోసం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో ఈడీ విచారణ చేపడుతున్నది. ఇదే కేసులో మాజీ క్రికెటర్లు అర్షద్ అయూబ్, శివలాల్ యాదవ్‌లను గత డిసెంబర్‌లో విచారించారు. హెచ్‌సీఏ కేసులో మాజీ మంత్రి, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జీ వినోద్‌ను కూడా ఈడీ ప్రశ్నించింది. గత ఏడాది నవంబర్‌లో వినోద్, శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్ ఇండ్లల్లో ఈడీ సోదాలు కూడా చేపట్టింది. మనీల్యాండరింగ్ చట్టం కింద 9 ప్రదేశాల్లో తనిఖీలు జరిగాయి. ఏసీబీ నమోదు చేసిన మూడు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ విచారణ మొదలుపెట్టింది. ఉప్పల్ స్టేడియం కోసం డీజీ సెట్లు, ఫైర్‌ఫైటింగ్ సిస్టమ్స్, కెనోపీల ఖరీదులో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది అక్టబర్‌లో అజారుద్దీన్‌పై నాలుగు క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. సుమారు 3.85 కోట్ల నిధుల్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉప్పల్ పోలీసు స్టేషన్‌లో ఆ కేసులు బుక్ చేశారు. చీటింగ్, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర కింద అజార్‌పై కేసులు పెట్టారు. హెచ్‌సీఏకు చెందిన నాలుగు కేసుల్లోనూ గతంలో సిటీ కోర్టు అజార్‌కు బెయిల్ మంజూరీ చేసింది. 2019లో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజార్ ఎన్నికయ్యారు. ఆయన 2023 ఫిబ్రవరి వరకు ఆ బాధ్యతలు నిర్వర్తించారు.

ఎస్‌బీఐ నకిలీ బ్రాంచ్ తెరిచి.. లక్షల్లో మోసం

రాయ్‌పూర్: మరో కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చింది. ఏకంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పేరుతో నకిలీ బ్రాంచ్‌ను తెరిచారు. కొందరు వ్యక్తుల నుంచి డబ్బులు వసూలు చేసి ఉద్యోగులుగా నియమించారు. ఆ బ్రాంచ్‌లో బ్యాంకు కార్యకలాపాలు కూడా ప్రారంభించారు. గ్రామస్తుల నుంచి డబ్బులు జమ చేసుకున్నారు. సమీపంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌కు సమాచారం అందడంతో ఈ మోసం బయటపడింది. ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కొందరు వ్యక్తులు భారీ బ్యాంకింగ్ మోసాన్ని పక్కాగా ప్లాన్ చేసి అమలు చేశారు. మారుమూల ప్రాంతమైన ఛపోరా గ్రామంలో ఏకంగా ఎస్‌బీఐ పేరుతో నకిలీ బ్రాంచ్‌ను తెరిచారు. కాంప్లెక్స్‌లోని షాపును అద్దెకు తీసుకున్నారు. నిజమైన బ్యాంకుగా నమ్మించేందుకు ఫర్నీచర్‌తోపాటు క్యాష్ కౌంటర్ వంటివి ఏర్పాటు చేశారు. కాగా, బ్యాంకు ఉద్యోగాల పేరుతో రెండు నుంచి ఆరు లక్షల వరకు మహిళలతో సహా ఆరుగురు వ్యక్తుల నుంచి డబ్బులు దండుకున్నారు. వారికి నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇవ్వడంతోపాటు శిక్షణ కూడా ఇచ్చారు. బయోమెట్రిక్ హాజరుతో వారు బ్యాంకు విధులకు హాజరయ్యారు. ఎస్‌బీఐ కొత్త బ్రాంచ్ ఏర్పాటు పట్ల గ్రామస్తులు కూడా సంతోషం వ్యక్తం చేశారు. లావాదేవీల కోసం ఆ బ్రాంచ్‌కు వెళ్లారు. అయితే సుమారు పది రోజుల పాటు పని చేసిన ఎస్‌బీఐ నకిలీ బ్రాంచ్ గురించి సమీపంలోని దబ్రా బ్రాంచ్ మేనేజర్ దృష్టికి వచ్చింది. ఈ బ్రాంచ్ పట్ల ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దీంతో సెప్టెంబర్ 27న ఎస్‌బీఐ అధికారులు, పోలీసులు కలిసి అక్కడకు వెళ్లారు. అచ్చం ఎస్‌బీఐ బ్రాంచ్ మాదిరిగా కనిపించడంతోపాటు బ్యాంకింగ్ సేవలు నిర్వహిస్తున్న నకిలీ బ్రాంచ్‌ను చూసి వారు కంగుతిన్నారు. మరోవైపు నకిలీ బ్రాంచ్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు నకిలీ నియామక పత్రాలు ఇచ్చినట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఈ నకిలీ బ్రాంచ్‌కు మేనేజర్‌గా వ్యవహరించిన పంకజ్‌తోపాటు రేఖా సాహు, మందిర్ దాస్‌తో సహా నలుగురు ఈ స్కామ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మోసంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామస్తులు డబ్బులు పోగొట్టుకోగా, నిజంగా బ్యాంకు ఉద్యోగమని నమ్మి నియామక పత్రాలు పొందిన వారు కూడా చిక్కుల్లో పడ్డారు.

జైలు ఖైదీల్లో కులవివక్ష సరికాదు

న్యూఢిల్లీ: జైలు మాన్యువల్స్‌లో క్యాస్ట్ కాలమ్‌ను తొలగించాలని కేంద్రం, రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. చిన్న కులాల ఖైదీలతో మరుగుదొడ్లు కడిగించడం వంటి స్కావెంజింగ్ పనులు, అగ్ర కులాల వారికి వంట పనుల కేటాయింపు వివక్షే అవుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. జైళ్లలో కుల ఆధారిత వివక్ష, విభజన ఉందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారించిన కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి చర్యలు అంటరానితనం కిందకే వస్తాయని పేర్కొంది. కులం ఆధారంగా ఖైదీలను వేరుగా ఉంచడం మార్పు తీసుకురాదని, వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించడం వలసవాద వ్యవస్థకు చిహ్నమని వెల్లడించింది.

ఆర్టికల్ 15 ఉల్లంఘనే..

"కొన్ని రాష్ట్రాల్లో కులం ఆధారంగా ఖైదీలకు పనులను అప్పగిస్తున్నారు. జైలులో గదుల కేటాయింపునకు సంబంధించిన నిబంధనలు సరికావు. షెడ్యూల్డ్ కులాల ఖైదీలకే క్లీనింగ్ పనులు అప్పగించడం విస్మయం కలిగిస్తోంది. కింది కులాల ఖైదీలకు మాత్రమే శుభ్రపరిచే పని, అగ్రవర్ణ ఖైదీలకు వంట పనులు ఇవ్వడం ఆర్టికల్ 15ను ఉల్లంఘించడమే. అభ్యంతరకరంగా ఉన్న నిబంధనలను అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మూడు నెలల్లో మార్చాలి. ఈ నిర్ణయం అమలుకు సంబంధించిన నివేదికను కూడా కోర్టులో సమర్పించాలి" అని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఖైదీలపై వివక్షకు కులం కారణం కారాదని, అలాంటి వాటిని అనుమతించేది లేదని తెలిపింది. పని విషయంలో అందరికీ సమాన హక్కు కల్పించాలని వివరించింది. ప్రమాదకరంగా ఉన్న మురుగునీటి ట్యాంకులను శుభ్రం చేసే పనులకు ఖైదీలను అనుమతించకూడదని సూచించింది. ఒక కులం వారినే స్వీపర్లుగా ఎంపిక చేయటం సమానత్వ హక్కుకు వ్యతిరేకమని వివరించింది.

రైతులను మోసగిస్తే కఠిన చర్యలు..

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇప్పటికే రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచే సన్నాలకు ఎమ్మెస్పీకి అదనంగా ఒక్కో క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుందని సీఎం స్పష్టం చేశారు. గత సీజన్ లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు మూడు రోజుల్లో డబ్బులు ఇచ్చామని, ఈసారి 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి గురువారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు జిల్లాల నుంచి ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సివిల్? సప్లయిస్? ఎండీ డీఎస్? చౌహాన్?, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్? రావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల కోసం ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 7 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు నెలకొల్పినట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే గుర్తించిన కేంద్రాలు కాకుండా.. ఎక్కడైనా కొనుగోలు కేంద్రం అవసరమని కలెక్టర్లు భావిస్తే అక్కడ కొత్త కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఈ వానాకాలంలో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారని, గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని సీఎం చెప్పారు.

సన్న వడ్లకు బోనస్ ఇవ్వటం ఇదే మొదటిసారి కావటంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి తప్పుడు జరగకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందని అన్నారు. సన్నవడ్ల సేకరణకు వీలుగా వేర్వేరు కొనుగోలు కేంద్రాలు, లేదా కొనుగోలు కేంద్రాల్లో వేర్వేరు కాంటాలు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. సన్న వడ్లు కొనేటప్పుడు నిర్దేశించిన ప్రమాణాలు తప్పకుండా పాటించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. సన్న రకాలను ధ్రువీకరించే యంత్రాలు, సిబ్బందిని అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. సన్న వడ్ల సేకరణలో అప్రమత్తంగా లేకపోతే గోల్‌మాల్ జరిగే ప్రమాదం ఉందని సీఎం హెచ్చరించారు. అటువంటి తప్పులు, అవకతవకలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని చెప్పారు. ప్రతి కేంద్రానికి ఒక నెంబర్ కేటాయించాలని, ఆ కేంద్రంలో కొనుగోలు చేసిన వడ్ల సంచులపైన ఆ నెంబర్ తప్పకుండా వేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దీంతో ఏ తప్పు జరిగినా, ఏ దశలో గోల్? మాల్? జరిగినా ఎక్కడ జరిగిందో సులభంగా తెలుసుకునే వీలుంటుందని చెప్పారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టడి చేయాలని పోలీస్ అధికారులను సీఎం అప్రమత్తం చేశారు. అన్ని మార్గాల్లోనూ పకడ్బందీగా నిఘా ఉంచాలని, చెక్ పోస్టుల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు

తాలు ,తరుగు, తేమ పేరు తో రైతులను మోసం చేసే వారిని సహించవద్దని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రైతులు ఎక్కడ కూడా దోపిడీకి గురి కాకూడదని, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును కలెక్టర్లు బాధ్యతగా స్వీకరించాలని కోరారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడే సంఖ్యలో గోనె సంచులు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంట వెంటనే తరలించేందుకు తగిన రవాణా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రతి గంటకోసారి కొనుగోలు కేంద్రాలకు వాతావరణ శాఖ సూచనలను చేరవేయాలని, దానికి అనుగుణంగా కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి రోజు కలెక్టర్లు తమ జిల్లాలో జరుగుతున్న కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షించాలని, ప్రతి రోజు ఉదయం నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి కేంద్రాలను పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాత పది జిల్లాలకు నియమించిన ప్రత్యేకాధికారులు ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన సమస్యలను ఏ రోజుకారోజు పరిష్కరించాలని, సివిల్ సప్లయిస్ విభాగంలో 24%శ%7 కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. అన్ని జిల్లాల్లోనూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు ఇచ్చే విషయంలోనూ కలెక్టర్లు నిబంధనలను పాటించాలని చెప్పారు. డిఫాల్ట్ లేని మిల్లర్లకు ధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఐదో తేదీ లోపు డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

అన్ని జిల్లాల్లో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనను 5వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. మొత్తం 11,062 మంది ఎంపికైన అభ్యర్థులకు దసరా పండుగలోపు నియామక పత్రాలను అందిస్తామని ప్రకటించారు. ఈ నెల 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా జిల్లాల్లో వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 9090 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని విద్యాశాఖ అధికారులు సీఎంకు వివరించారు.

బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఒప్పందాలు జరిగాయి

మెదక్ : బీఆర్ఎస్, బీజేపీలపై మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. కవిత కోసం బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఒప్పందాలు జరిగాయని.. అందుకే ఆమె బెయిల్‌పై బయటకు వచ్చారన్నారు. గురువారం నాడు గజ్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన మంత్రి కొండా సురేఖ.. బీఆర్ఎస్, బీజేపీలపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు.

కొండా సురేఖ కామెంట్స్..

'గజ్వేల్ ప్రజలు అనుకుంటే ఏదైనా సాధిస్తారని నమ్మకం ఉంది. మెదక్ ఎంపీ అభ్యర్థిగా బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్.. బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకుంది. ఎంపీలుగా బీజేపీని గెలిపిస్తామని, కవితని వదిలిపెట్టాలని ముందే అమిత్ షాతో ఒప్పందం చేసుకున్నారు. ప్రజలకు ఏ విధంగా సేవ చేయాలా అని మేము చూస్తుంటే.. బీఆర్ఎస్ పార్టీ మాత్రం ప్రజలను తప్పు దారి పట్టిస్తోంది. సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు, రాతలు రాపిస్తూ కేటీఆర్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ప్రతిపక్షం ఇంతవరకు నియోజకవర్గం లో కానీ, అసెంబ్లీలో కానీ అడుగుపెట్టలేదు. గజ్వేల్ ఎమ్మెల్యే ఉన్నాడా లేడా అనేది ప్రశ్నగా ఉంది. కేసీఆర్ కనపడట్లేదు అని పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఇవ్వాలి. కేసీఆర్‌ను పక్కన పెట్టి.. ప్రజా సొమ్మును దోచుకొని.. ప్రజలలో బీఆర్ఎస్‌పై నమ్మకం పోయేలా చేసింది కేటీఆర్. మొన్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కారణం కేటీఆర్. ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలి కానీ అడ్డుపడితే ఊరుకునేది లేదు.' అని అంటూ విపక్షాలకు మాస్ వార్నింగ్ ఇచ్చారు మంత్రి.

హామీలన్నీ అమలు చేస్తాం..: తుమ్మల

తల తాకట్టు పెట్టి అయినా రైతాంగానికి అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. త్వరలోనే రూ. 2 లక్షల రుణ మాఫీనీ పూర్తిచేస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వాలు రైతు రుణమాఫీపై మాట కూడా మాట్లాడలేదు. దేశంలో ఏ రైతు పండించని పంటలు మన రైతులు పండిస్తున్నారు. ప్రతి గింజను మార్కెట్ ధర కంటే ఎక్కువకు ప్రభుత్వమే కొని రైతులను ఆదుకుంటాం. రైతును దగా చేసిన వాళ్ల మాటలు నమ్మవద్దు. మేము ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తిగా అమలు చేస్తాం. సంవత్సరం లోపు రూ. 300 కోట్లతో జిల్లాలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తాం. పామ్ ఆయిలో రాష్ట్రంలో, దేశంలోనే సిద్దిపేట జిల్లా మొదటిస్థానం లో ఉండాలి. ఇతర దేశాల నుండి లక్ష కోట్లు పెట్టు ఆయిల్ కొంటున్నాము. ఇప్పటికే 11 వేల ఎకరాలు సాగు అవుతుంది. ఇంకా 11 వేల ఎకరాలకు పెంచాలి. భారత దేశానికి కావలసిన ఆయిల్ మొత్తం తెలంగాణ ఇస్తుందని రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి చెప్పారు.' అని మంత్రి తుమ్మల చెప్పుకొచ్చారు.

రైతాంగానికి అండగా కాంగ్రెస్ సర్కార్: పొన్నం ప్రభాకర్

'రైతాంగానికి ఎక్కడ ఇబ్బంది వచ్చినా వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు 1వ తేది నుండి అందుబాటులోకి వస్తాయి. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ అనేక అబద్ధపు హామీలు ఇచ్చారు. నాటి ప్రభుత్వంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేసే విధంగా రాచరికపు నిర్ణయాలు తీసుకున్నారు. శాసన సభ్యునీ హోదాలో ఇంత వరకు నియోజకవర్గంలో అడుగుపెట్టలేదు. బీజేపీ, బీఆర్ఎస్ రైతు వ్యతిరేఖ చట్టాలు తీసుకువచ్చాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు రైతాంగం అండగా ఉంది. గత ప్రభుత్వం రైతాంగానికి ఇవ్వవలసిన పనిముట్లను వాళ్ళ కార్యకర్తలకు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ విధంగా కాకుండా చిన్న, సన్నకారు రైతులకే వ్యవసాయ పనిముట్లు అందజేస్తాం.' అని మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు భరోసా ఇచ్చారు.

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు

-మొదటిపేజీ తరువాయి

చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ డిజిటల్ కార్డుల ద్వారానే రేషన్ కార్డు ,హెల్త్ కార్డు , పింఛను , ప్రభుత్వ పథకాలన్నీ ప్రామాణికం కానున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్ట్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ లో ప్రారంభించారని తెలిపారు.రాష్ట్రం మొత్తం 119 నియోజకవర్గాల్లో 288 చోట్ల ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్ట్ ప్రారంభం అయిందని,ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమం కోసం ఒక గ్రామం , మున్సిపాలిటీ లో ఒక వార్డ్ పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేశారన్నారు. ఎంత మంది పౌరులున్న కుటుంబం పరంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పం తీసుకుందని తెలిపారు. ఇందులో కుటుంబ ఆస్తుల వివరాలు ఆర్థిక లావాదేవీలు అడగరన్నారు. కుటుంబ సభ్యుల సంఖ్య ఒక గ్రూప్ ఫోటో లాంటి వివరాలు మాత్రమే అడుగుతారని తెలిపారు.గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. ఇంట్లో నలుగురు పిల్లలు ఉండి పెళ్ళిళ్ళు అయి వారికి పిల్లలున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇస్తారని,ఈ కార్డు ఉంటే ప్రభుత్వ పథకాలు ఎక్కడైనా తీసుకోవచ్చు అని తెలిపారు. డిజిటల్ గుర్తింపు కార్డు ఫ్యామిలీ పెద్దగా మహిళా పేరు మీదనే వస్తుందన్నారు. గుర్తింపు కార్డు ద్వారానే ఇందిరమ్మ ఇళ్లు ,పింఛన్లు ప్రభుత్వ పథకాలు అన్ని డిజిటల్ కార్డు ద్వారానే వస్తాయని అన్నారు.కర్ణాటక హర్యానా లాంటి ప్రాంతాల్లో ఇప్పటికే ఈ డిజిటల్ కార్డులను అమలు చేస్తున్నారన్నారు.ఇప్పటికే అక్కడ మా అధికారులు అక్కడ పరిశీలించి అధ్యయనం చేశారని తెలిపారు.ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసింది ఇప్పటికే లక్షా ,లక్షా 50 వేలు ,2 లక్షల లోపు ఉన్న వారికి రుణమాఫీ పూర్తైందన్నారు.2 లక్షల పైన ఉన్న వారికి 2 లక్షల వరకు దసరా లోపు మాఫీ అవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారన్నారు.గత ప్రభుత్వం లో లక్ష రూపాయల రుణమాఫీ నాలుగు విడతలుగా చేశారు..మేము ఒకేసారి పూర్తి చేశామన్నారు. అర్హత ఉండి ఎక్కడైనా రుణమాఫీ కాకపోతే అధికారులకు వివరాలు ఇవ్వాలన్నారు.ఈ పైలెట్ ప్రాజెక్ట్ కార్యక్రమం లో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావా లన్నారు. ఈ.కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో , ఎంపిడివో ,ఇతర అధికారులు,కరీంనగర్ నియోజకవర్గ ఇన్చార్జి పురుమల్ల శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

మూసీ కూల్చివేతలకు బ్రేక్.. ఎందుకంటే

హైదరాబాద్ : మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌లో భాగంగా మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపుకు బ్రేక్ పడింది. శంకర్ నగర్, మూసానగర్‌లో స్థానికులు ఇళ్ళు ఖాళీ చేయకపోవడంతో అధికారులు కూల్చివేతలను నిలిపివేశారు. ఈ కూల్చివేతలకు రెవెన్యూ అధికారులు తాత్కాలిక బ్రేక్ ఇచ్చారు. ఓల్డ్ మలక్‌పేట్, శంకర్‌నగర్‌లో 450 ఇళ్లను అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు 140 ఇళ్లు కూల్చివేసి బాధితులను చంచల్‌గూడలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లకు తరలించారు. ఖాళీ చేసిన ఇళ్లను ఇప్పటి వరకు అధికారులు కూల్చివేశారు. అయితే కొంతమంది బాధితులు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించినప్పటికీ ఖాళీ చేయని పరిస్థితి. హైదరాబాద్ శివారులో డబుల్ బెడ్‌రూంలు కేటాయించారని.. ఒక్కో ఇంట్లో 16 మంది ఉన్న వారికి డబుల్ బెడ్ రూంలు ఏం సరిపోతాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంతా ఇళ్లు ఖాళీ చేయని నేపథ్యంలో అధికారులు కూల్చివేతలకు కాస్త బ్రేక్ ఇచ్చారు. అయితే బాధితులకు డబుల్ బెడ్ రూమ్‌తో పాటు 25 వేల సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తున్న విషయం తెలిసిందే. కాగా.. ఆపరేషన్ మూసీలో భాగంగా రెండు రోజుల క్రితమే మూసీపరివాహక ప్రాంతాల్లో ఇళ్లను కూల్చివేసే పనులను ప్రారంభించారు రెవెన్యూ అధికారులు. %=దీ- శ% అని రాసి, ఇళ్ళు ఖాళీ చేసిన వాటిని అధికారులు కూల్చివేస్తున్నారు. ఎలాంటి అవాంతరాలు జరుగకుండా భారీ బందోబస్తు నడుమ ఇళ్లను కూల్చివేశారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌ను వరదల నుంచి రక్షించేందుకు, ఆక్రమణకు గురైన మూసీ నది పరివాహక ప్రాంతాలను పునరుద్ధరించి, కాలుష్య కోరల నుంచి మూసీని కాపాడేందుకు ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది.అధికారులు ముందుగా మూసీ నది ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేశారు. అందులో దాదాపు 16 వేల నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తేలింది. అందులో పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్నారు.

చెంచులు.. గిరిజనులకు మెరుగైన వైద్యం కోసం చర్యలు..

రాష్ట్రంలో మొట్టమొదటిసారి ఐటీడీఏ పరిధిలో నివసించే చెంచులు, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పరిధి లో నివసించే చెంచులకు, గిరిజనులకు అందుతున్న వైద్య సేవలపై హైదరాబాద్‌లోని దామోదరం సంజీవయ్య భవన్ లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఐటీడీఏ పరిధిలోని ఉట్నూరు, భద్రాచలం, ఏటూరు నాగారం, మున్ననూరు లతో పాటు ఇతర జిల్లాలలో ఉన్న గిరిజనులకు, చెంచులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన విషయమై మంత్రి దామోదర్ రాజ నర్సింహ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో చెంచులు, గిరిజనులకు వైద్య వసతుల కల్పనపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, వైద్యారోగ్య శాఖల అధికారులకు మంత్రి రాజ నర్సింహ దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి చెంచు పెంట, గిరిజన గూడెంలో నివసించే ప్రతి వ్యక్తికి మెరుగైన వైద్యం అందేలా కార్యాచరణను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ విషయమై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, అటవీ శాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. భౌగోళికంగా ఐటీడీఏ పరిధిలో అత్యవసర పరిస్థితుల్లో అరగంట లోపే వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రులకు చేరుకునేలా కార్యాచరణను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశానిర్దేశం చేశారు. గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు భౌగోళికంగా నెట్వర్క్ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని దామోదర్ రాజ నర్సింహ చెప్పారు. అవసరమైన చోటా కొత్తగా ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలోని ఆసుపత్రులలో సిబ్బంది, డాక్టర్లు మందులు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యంగా వర్షాకాలంలో ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ (ఈడీడీ) కంటే వారం ముందు గర్భిణీలను ఆసుపత్రికి తరలించి వారిని బర్త్ వెయిటింగ్ రూమ్ లలో ఉంచేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజ నర్సింహ పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాలలో స్థానిక గిరిజన భాష తెలిసిన సిబ్బందిని నియమించాలన్నారు. తద్వారా వారి సమస్యలను విని పరిష్కరించేందుకు దోహదపడుతుందన్నారు. అటవీ ప్రాంతంలో 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితులలో వైద్య సేవలు అందించేందుకు బైక్ అంబులెన్స్ ను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐటీడీఏ ప్రాంతాలలో సీజనల్ వ్యాధుల నివారణ పై మంత్రి దామోదర్ రాజనర్సింహ చర్చించారు. రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి గిరిజన వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం తీసుకున్న ముందు జాగ్రత్త చర్యల వల్ల సీజన్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమీక్ష లో గిరిజన శాఖ ముఖ్య కార్యదర్శి శరత్, హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చో%శీ%గ్తూ, ఫ్యామిలీ హెల్త్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ వాసుదేవ్ రావు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ప్రజా ఆరోగ్యశాఖ సంచాలకులు డా. రవీంద్రా నాయక్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా. అజయ్ కుమార్, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలం..

-మొదటిపేజీ తరువాయి

వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్ పెన్ పహాడ్, వాడపల్లి, హాలియా ఎస్ఐలను వేకెన్సీ రిజర్వ్‌లో పెట్టారు. కొందరు అధికారులకు ఇసుక రవాణాలో ప్రత్యక్ష, పరోక్ష సహకారం ఉందని.. ఈ క్రమంలో వారిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. త్వరలో వీరందరినీ లూప్‌లైన్‌కు బదిలీ చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే అడవిదేవీపల్లి, వేములపల్లి, నార్కట్‌పల్లి, చండూర్, మాడుగులపల్లి, తిప్పర్తి, చింతలపాలెం, తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం, అచ్చంపేట్, బొంరాస్‌పేట్, తాండూర్, చిన్నంబావి ఎస్‌లను బదిలీ చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఇసుక అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుందని.. వాగులు, నిషేధిత నదీ ప్రాంతాల్లో విచక్షణా రహితంగా ఇసుకను తవ్వితే పర్యావరణ సమత్యులతకు భంగం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వంతో పాటు డీజీపీ అక్రమ రవాణాపై సీరియస్‌గా ఉన్న నేపథ్యంలో చర్యలు తీసుకున్నట్లు ఇసుక అక్రమ రవాణాకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సిందేనన్నారు. అలాగే ఇసుక అక్రమ రవాణా వసూళ్లకు పాల్పడిన కొండమల్లేపల్లి హోంగార్డ్, జడ్చర్ల కానిస్టేబల్‌ను డీఏఆర్‌కి అటాచ్ చేసినట్లు చెప్పారు. వీటితో పాటు పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేసినా చర్యలుంటాయన్నారు. బాధ్యతాయుతమైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ ఓ మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో అలసత్యం వహించిన, దర్యాప్తులో అవకతవకలకు పాల్పడిన వికారాబాద్ టౌన్ సీఐ ఏ నాగరాజును సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

మార్పు మార్పు అంటూ కాంగ్రెస్ మోసం చేసింది

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క సంక్షేమ, అభివృద్ధి పథకం అమలుకు నోచుకోలేదు. రేవంత్ సర్కార్ పరిపాలన ఎక్కడ వేసినా గొంగడి అక్కడే అన్నచందంగా తయారైంది. పరిపాలన అస్తవ్యస్తంగా మారడంతో పెట్టుబడులు ఆగిపోయాయి. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లేకుండా పోయాయి. ఆదాయం కూడా పూర్తిగా పడిపోయింది. ఇక రాష్ట్ర ఖజానాకు తగ్గుతున్న ఆదాయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం.. పరిపాలన వైఫల్యానికి నిదర్శనం.. అనుభవ రాహిత్యంతోనే ఈ అనర్థం.. అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. సంపద సృష్టించి పేదలకు పంచే తెలివి.. సీఎం రేవంత్ రెడ్డికి లేకపోవడంతో అసలు సమస్య ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే ఈ దుస్థితి ఉంటే.. వచ్చే నాలుగేళ్లు కష్టకాలమే అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గడ్డు పరిస్థితులను మరింత దిగజార్చే చేష్టలే తప్ప.. దిద్దుబాటు చర్యలు కనుచూపు మేరలో కనిపించడం లేదన్నారు. తెలంగాణ ప్రగతి పథానికి పాతరేసిన పాపం.. మార్పు మార్పు అంటూ మోసం చేసిన కాంగ్రెస్ పార్టీదే అని కేటీఆర్ దుయ్యబట్టారు.

ఎమ్మెల్యే అనర్హత వేటు.. స్టే ఇచ్చేందుకు నిరాకరణ

-మొదటిపేజీ తరువాయి

సందర్భంగా అసెంబ్లీ సెక్రటరీకి, స్పీకర్‌కు సూచనలు చేసింది. నెల రోజుల్లో నిర్ణయం తీసుకొని షెడ్యూల్‌ను బెంచ్ ముందు ఉంచాలని ఆదేశించింది. లేకుంటే సుమోటోగా తామే ఓ నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అసెంబ్లీ సెక్రటరీ హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వెళ్లారు. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరారు. ఇప్పటికిప్పుడు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కుదరని చెప్పేసింది. తదుపరి వాదనలు 24న వింటామని పేర్కొంది. హైకోర్టులో ఏప్రిల్‌లో పిటిషన్ వేసే నాటికి బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు పార్టీ మారారు. వాళ్లపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దా

ఆకల వర్షం ఆపారా నష్టం



ఖమ్మం , శుభ తెలంగాణ ఫ కూసు మంచి మండలంలో నీ బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరి పంట నెల కోరింది. రైతులు దిక్కు తోచక ఆందోళన చెందుతున్నారు. ఏడాది రైతులు లక్షలాది రూపాయలు నష్టపోవాల్సి వచ్చింది. పంట సాగు చేయడానికి భారీగా ఖర్చు వచ్చిన నోటికాడికి వచ్చిన వరి పంట నీటి పాలెందని రైతులు లబోదిబోమంటున్నారు. కూసుమంచి మండలంలోని మల్లాయిగూడెం గ్రామానికి చెందిన కౌలు రైతు దాసరి గోపి ది వరి పొలం సుమారు 30 ఎకరాలు వరి పొలం అంతా నెల మొత్తం కావడం చాలా బాధాకరం. వారం రోజుల్లో పంట కోతకు వస్తుందనే సమయంలో వరి పైరు మోకాటి నీటి లోతులో మునిగిపోయా యని రైతులు అంటున్నారు. ఏటా ఇదొక కాంతుగా మారిందనీ కానీ రైతుకు ఎలాంటి సహాయం అందడం లేదని వాపోతున్నారు. నోటి కాడికి వచ్చిన వరి పంట పాడైపోతే ప్రత్యామ్నాయ పంటలు లేవని ప్రధాన పంట వారే అని అంటున్నారు. అధికారు లు స్పందించి పంట నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. రైతుల పొలాల వద్దకెళ్లి కన్నీరు మున్నీరు అవుతున్నారు. వర్షానికి వరి పైరంగ పడిపోయిందని వాటిపక్క చూసి కన్నీరు కారుస్తున్నారు.

నిజామాబాద్ నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమలకు

భూమి పూజ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్, , శుభ తెలంగాణ నిజామాబాద్ 20 వ డివిజన్ మరియు 16 వ డివిజన్ లో సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ నగర మేయర్ నీతుకిరణ్ పాల్గొని భూమి పూజా చేయడం జరిగింది అనంతరం ఎమ్మెల్యే గారు మాట్లాడుతు మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా నగరంలోని కంటేశ్వర్ బ్యాంకు కాలనీలో 10-లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేయడం జరిగిందని మరియు 16వ డివిజన్ లో ఎం కె గార్డెన్ సీసీ రోడ్డు %డ% డ్రైనేజీ పనులను ప్రారంభించడం జరిగిందని అన్నారు.. జనరల్ ఫండ్ కింద ప్రతి డివిజన్ కు రూ.10 లక్షలు మంజూరయ్యాయన్నారు, నగర అభివృద్ధికి %డ%సుందరికరణకు తగిన నిధులు విడుదల చేయాలనీ ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని,గతంలో ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు,ముఖ్యమంత్రి రేవంత్ దృష్టికి కూడా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబందించిన పనులకై స్పెషల్ ఫండ్ 100 కోట్ల నిధులు మంజూరు చేయాలనీ వినతిపత్రాలు ఇవ్వడం జరిగిం దన్నారు... రాష్ట్ర ప్రభుత్వం 14%ష్ట, 15ష్ట% ఆర్థిక సంఘం బకాయిలు చెల్లించని కారణంగా కేంద్ర ప్రభుత్వ నిధులు కూడా ఆగిపోయినాయి అని అన్నారు..రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బకాయిలను చెల్లించి నగర అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలనీ డిమాండ్ చేసారు.... నగరంలో డివిజన్ కి మరో 10 లక్షలు అభివృద్ధి కార్యక్రమాలకు విడుదల చేయాలనీ మున్సిపల్ శాఖకు, కమిషనర్ గారికి సూచించారు ఈ కార్యక్రమం లో స్థానిక 20 వ డివిజన్ కార్పోరేటర్ న్యాలం రాజు గారు, మరియు 16 వ డివిజన్ కార్పొరేటర్ పంచారెడ్డి ప్రవళిక గారు,మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక బీజేపీ నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టొద్దు రాష్ట్ర ప్రభుత్వం

వెంటనే వర్గీకరణను ఆపండి

మాల మహానాడు ఖమ్మం జిల్లా అధ్యక్షులు కామ సంపత్ కుమార్

ఖమ్మం , శుభ తెలంగాణ : ఎస్సీ వర్గీకరణ చేయడం కుదరదని దళితులందరూ కలిసే ఉండాలన్న ఉద్దేశంతో గతంలో 2004లో సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టంగా చెప్పి తీర్పుని ఇవ్వడం జరిగినది కానీ కొన్ని సంవత్సరా లుగా కేంద్ర ప్రభుత్వం బిజెపి చేస్తున్న కుట్ర కుట్రలో భాగంగా ఆగస్టు ??వ తారీఖున సుప్రీంకోర్టు ధర్మాసనం మళ్లీ ఎస్సీ వర్గీకరణ చేయొచ్చని ప్రభుత్వాలకు అప్పజెప్ప డం జరిగినది కానీ రాష్ట్ర ప్రభుత్వము ఎస్సీ వర్గీక రణ చేసి దళితులను విడదీయరాదని ఇది రాజ్యాంగ విరుద్ధమని మాలలంటే కాంగ్రెస్ కాంగ్రెస్ అంటే మాలలని జెండాలు మోసి ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని రాష్ట్ర ప్రభుత్వాని ఏర్పాటు చేసుకోవడానికి మాలలు ఎంతో కృషి చేశారని అందరికీ తెలిసిన విషయమే నాని మాల మహానాడు ఖమ్మం జిల్లా అధ్యక్షులు కామ సంపత్ కుమార్ అన్నారు .ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వము పునర్ ఆలోచన చేసి ఇచ్చిన మాటను వెనక్కి తీసుకొని దళితులకు ఇప్పుడున్న 15% శాతం నుండి 25% వరకు పెంచేలా ఆలోచన చేయాలని మాల మంత్రి లేకుండా వేసిన ఉత్తమ కమిటీ ఎన్ని రిపోర్టులు ఇచ్చిన ఉపసంహ రించు కోవాలని తాతల ముత్తాతల కాలం నుండి అన్న దమ్ముల కలిసి ఉన్న మాల మాదిగలను విభజిం చకూడదని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

కొలువుదీరిన దుర్గ అమ్మవారు

భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలు

కాల్వ శ్రీరాంపూర్ , శుభ తెలంగాణ మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం దుర్గ మాత ను ఆలయాలలో ప్రతిష్టించారు కమిటీ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దుర్గాదేవిని ప్రతిష్టించారు అలాగే ఉషన్న పల్లి గ్రామంలో నవరాత్రులు పూజా కార్యక్రమా లు నిర్వహించి గ్రామంలోని చెడును విడదోలి మంచి జరగాలని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు మేడిద సంజీవరెడ్డి మాట్లాడుతూ దుర్గాదేవి ప్రధాన హిందూ దేవత అని రాక్షసులను సంహరించిన మూల ప్రకృతి అని దుర్గా దేవి కి 18 చేతులు ఉన్నాయని దుర్గాదేవిని మహిషాసురమర్ధిని మహాలక్ష్మి దేవి అని పిలుస్తారని దుర్గాదేవికి ఇష్టమైన మంత్రం ఓం శ్రీ దుర్గాయై నమః సర్వ మంగళ మంగల్యే శివే సర్వార్థ సాధకే శరణ్య త్రయంబకే దేవి నారాయణి నమోస్తుతే

అని దుర్గాదేవిని పూజించిన ఎడల వారి కుటుంబానికి రక్షణగా ఉంటుందని ప్రతి ఒక్కరు దుర్గామాత ఆశీస్సులు తీసుకోవాలని చెప్పడం జరిగింది

హైడ్రా విషయంలో రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

మాజీ ఎంపీపీ రామ సహాయం వెంకటరెడ్డి

ఖమ్మం , శుభ తెలంగాణ హైడ్రాకు, రాహుల్ గాంధీకి ఏం సంబంధ మని, అసలు కేటీఆర్ సోయి ఉండే మాట్లాడుతున్నారా హైడ్రా విషయంలో రాహు ల్ గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్య లను ఖండిస్తున్నాం అని కుసుమంచి మండలం మాజీ ఎంపీపీ రామ సహాయం వెంకట్ రెడ్డి అన్నారు . బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు 800 చెరువులను కబ్జా చేశారని అందు వల్లే కూల్చివేతలపై భయపడుతు న్నారన్నా రు. డీపీఆరే తయారు కానప్పుడు అవినీతి ఎలా జరుగు తుంది.మూసీ ప్రవాహానికి అడ్డుగా ఉన్నవాటిని తొలగిస్తున్నట్లు చెప్పారు. ఎస్టీఎల్, బఫర్లో జోన్లో ఉన్నవాటిని హై డ్రా కూల్చివేస్తుం దని, మూసీ వేరు హైడ్రా వేరని వెల్లడించారు. ప్రభుత్వ చర్యల తో హైదరా బాద్లోని చెరువులకు పూర్వ వైభవం వస్తుంద న్నారు. మూసీ ప్రక్షాళన చేస్తామని గతంలో కేసీఆర్ చెప్పా రన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలని అన్నారు.

జాగృతి మహిళా డిగ్రీ కళాశాల ప్రభంజనం

బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ కు పోలు శ్రావణి ఎంపిక

హనుమకొండ భీమారం , శుభ తెలంగాణ ఈనెల 4,5,6 తేదీల్లో 69 వ రాష్ట్ర స్థా జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ కామారెడ్డి జిల్లాలో కోటి ప్రదేశం ఉండగా ఈ రాష్ట్రస్థాయికి జాగృతి మహిళ డిగ్రీ కళాశాల నుండి పోలు శ్రావణి బీకాం ఫస్ట్ ఇయర్ చదువుతున్న శ్రావణి ఎంపిక అవ్వడం జరిగింది ఈ క్రీడాకారినికి ఉపాధ్యాయుల బృందం అభినందనలు తెలిపిన వారిలో కాలేజీ కరస్పాండెంట్ హెల్దీ మహేందర్, డైరెక్టర్ ఎల్లి రవీందర్, డి,శ్రీనివాసరెడ్డి, ఏ సునీల్, ప్రిన్సిపల్ ఎల్ ఉమాపతిరావు, కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ల కుమారస్వామి, మరియు కాలేజీ ఉపన్యాసకులు ఏ చిరంజీవి, శ్రీకాంత్ ,చిట్యాల నరేష్, గొల్లమల్ల వీరాచారి, పి నరేష్ తదితరులు పాల్గొన్నారు

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్(2024-25) 356 ధాన్యం కొనుగోళ్ళు కేంద్రాల ఏర్పాటు చేస్తాం

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి, , శుభ తెలంగాణ: కామారెడ్డి జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్(2024-25) 356 ధాన్యం కొనుగోళ్ళు కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోళ్ళు చేయడానికి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ 2024-25 గాను 356 ధాన్యం కొనుగోళ్ళు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. క్వింటాలు ధాన్యానికి కనీస మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి గాను రూ.2,320/-, కామన్ రకానికి రూ. 2,300/- మరియు సన్న వడ్లు విక్రయించే రైతులకు అదనంగా క్వింటాల్ కు రూ.500/- ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను పరిష్కరించడానికి జిల్లా కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 08468-220051 ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ జి.రాజేంధర్, అసిస్టెంట్ జిల్లా పౌరసరఫరాల అధికారి కెవైఎల్ నరసింహ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, ఆర్టీ ఒ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కో ఆపరేటివ్, మార్కెటింగ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవోస్ కాలనీలో... ఘనంగా దేవి శరన్నవరాత్రులు.....

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన : మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి దంపతులు

హుజూర్ నగర్ , శుభ తెలంగాణ : అంగరంగ హుజూర్ నగర్ లో మూడో వార్డ్ ఎన్జీవోస్ కాలనీ లో దేవి శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేసిన కమిటీ నిర్వాహకులు. బాలా త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు. అమ్మ వారి కి వస్త్రాలు సమర్పించిన మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సంపత్ రెడ్డి దంపతులు.నవరాత్రి వేడుకల్లో అమ్మవారిని ఊరేగింపుగా పురవీధుల వెంబడి తీసుకొచ్చి కనకదుర్గ అమ్మవారిని అలంకరించి భక్తిశ్రద్ధలతో దంపతులు పీటల మీద కూర్చొని పూజలు నిర్వహించారు. వాడ వాడలా మహిళలు అందంగా ముస్తాబై రకరకాల పూలతో బతుకమ్మను పేర్చి తొమ్మిది రోజులపాటు సాగి బతుకమ్మ వేడుకలకు స్వాగతం పలికారు. దేవి నవరాత్రులలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొండా సురేఖ వివాదాన్ని ముగిద్దాం

సినీ ప్రముఖులకు కాంగ్రెస్ విజ్ఞప్తి

హైదరాబాద్, శుభ తెలంగాణ : తెలుగు పరిశ్రమలో పెను దుమారం రేపిన మంత్రి కొండా సురేఖ కామెంట్స్ చిచ్చు ఇంకా చల్లారలేదు. దీనిపై అమె ఒకడుగు వెక్కి తగ్గి వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నా సినిమా ఇండస్ట్రీ నుంచి ఎదురుదాడి కొనసాగుతూనే ఉంది. ఫిల్మ్ ఛాంబర్ కూడా ప్రత్యేకంగా సమావేశమై దీనిపై చర్చించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. అయితే ఈ వివాదానికి ముగింపు పలకాలని కాంగ్రెస్ ప్రయత్నాలు ప్రారంభించింది. కొండాసురేఖ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్నందున ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని సినీ ప్రముఖులను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఇరు వైపుల కూడా మహిళలే ఉన్నందున అర్థం చేసుకొని శాంతించాలని కోరారు. తప్పును గ్రహించి కొండా సురేఖ వెనక్కి తగ్గారన్నారు. అందుకే వివాదాన్ని ముగిస్తే సమంజసంగా ఉంటుందన్నారు. అదే టైంలో కొండా సురేఖపై కేటీఆర్ చేసిన కామెంట్స్, ట్వీట్‌లను కూడా పరిశీలించాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు, మంత్రులు, కాంగ్రెస్ కార్యకర్తలకి కూడా మహేష్ కుమార్ గౌడ్ పలు

సూచనలు చేశారు. వివాదాల జోలికి పోవద్దని సూచించారు. ఏదైనా విషయంపై మాట్లాడే టైంలో జాగ్రత్తగా ఉండాలని హితవుపలికారు. పదాలు వాడే క్రమంలో కంట్రోల్డ్‌గా ఉండాలన్నారు. మరోవైపు కేటీఆర్‌పై తీవ్రంగా విమర్శలు చేసే క్రమంలో అక్కినేని ఫ్యామిలీ, సమంతపై కొండ సురేఖ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అయితే ఇవి పెను దుమారానికి కారణమయ్యాయి. ఆమె మీద ఫైర్ అవుతూ తెలుగు ఇండస్ట్రీలోని పెద్దలంతా గళం విప్పారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు ఇలాంటి కామెంట్స్ చేయడం ఏంటని ప్రశ్నించారు. అటు అక్కినేని ఫ్యామిలీ కూడా తమను రాజకీయాల్లోకి లాగొద్దని అభ్యర్థించారు. సమంత కూడా ఘాటుగా స్పందించారు.

వివాదం ముదురుతుందని గ్రహించిన తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. బుధవారం రాత్రి కొండా సురేఖతో మాట్లాడి వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టే చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో వెంటే సమంతను ట్యాగ్ చేస్తూ కొండా సురేఖ ట్వీట్ చేశారు. తను తప్పుగా మాట్లాడినట్టు అనిపిస్తే తన కామెంట్స్‌ను వెనక్కి తీసుకుంటానంటూ చెప్పుకొచ్చారు.

నా వ్యాఖ్యల ఉద్దేశం మహిళల పట్ల ఒక నాయకుడి చిన్నచూపు ధోరణిని ప్రశ్నించడమే కానీ మీ మనోభావాలను దెబ్బతీయడం కాదు.స్వయం శక్తితో మీరు ఎదిగిన తీరు నాకు కేవలం అభిమానం మాత్రమే కాదు.. ఆదర్శం కూడా.

గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ

పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం..

ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు తుమ్మల, పొన్నం, సీతక్క, కొండ సురేఖ..

సిద్దిపేట, శుభ తెలంగాణ : గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ ముఖ్య అతిథులుగా హాజరైయారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి వైస్ చైర్మన్ మహమ్మద్ సర్ధార్ ఖాన్ డైరెక్టర్‌ల ప్రమాణ స్వీకారం అనంతరం నూతన కార్య వర్గాన్ని మంత్రులు అభినందించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ గజ్వేల్ నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గానికి శుభాకాంక్షలు. రైతాంగానికి సంబంధించి తెలంగాణలోనే కాదు దేశ వ్యాప్తంగా వ్యవసాయంలో ఎలాంటి మంచి నిర్ణయం తీసుకోవాలన్న కాంగ్రెస్ ప్రభుత్వమే. మీకు ఏ సమస్య వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. వరి ఉత్పత్తి అయి మార్కెట్ కి ధాన్యం వస్తుంది రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నాము. రైతులను సమన్వయం చేసుకొని ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా వారి ఉత్పత్తులు నష్టపోకుండా మరింత కష్టపడాలి. నా రాజకీయ జీవితం మార్క్ ఫెడ్ చైర్మన్ గా మొదలైంది. రైతులకు సేవ చేశానని అన్నారు. తరువాత ఎంపి అయి తెలంగాణ సాధన కోసం పోరాడినా. గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల అప్పు చేసింది. 47 వేల కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. రాచరికపు పరిపాలన ను ప్రజలు ఇంటికి పంపించారు. మాజీ ముఖ్యమంత్రి గజ్వేల్ శాసన సభ్యుడు ఇంత వరకు గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించలేదు.

కళ్యాణ లక్ష్మి చెక్కులు పంచకుండ ఇబ్బందులు పెడుతున్నారు. శాసన సభ లో ప్రతిపక్ష నాయకుడిగా నిర్మాణాత్మక సలహాలు ఇస్తరనుకున్నాం. కనీసం సమావేశాలకు అటెండ్ కావడం లేదని అన్నారు.

వరదల్లో మంత్రులు, అధికారులు పర్యటించారు కేంద్ర మంత్రులు వస్తె ఇక్కడి నష్టపరిహన్ని చూపించాం. 10 వేల కోట్ల నష్టం జరిగిందని నివేదికలు ఇస్తే 400 కోట్లు ఇచ్చారు. తెలంగాణ కు ఇంత అన్యాయం జరుగుతుంటే బీజేపీ నాయకులు స్పందించడం లేదు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ బీజేపీ కుమ్మక్కైనా సున్నా సీట్లు ఇచ్చారు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వాళ్ళని ఇంటికి పంపించాలి ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాన్ని కులగోడతాం అని ప్రకటిస్తుంటే శాసన సభ్యులు వచ్చి చేరుతున్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూలగొట్టి దమ్ముందా అని అన్నారు.

గత 10 సంవత్సరాల్లో రైతులకు ఉపయోగపడే ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు సాంకేతిక పరమైన వస్తువులు ఇవ్వలేదు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి విజ్ఞప్తి చేస్తున్నా రైతులకు ఉపయోగపడే వస్తువులు, పరికరాలు, పనిముట్లు ఇవ్వాలని కోరుతున్నానని అన్నారు.

పరిశ్రమల్లో పరిశుభ్రత పాటించాలి

కమాన్ పూర్, శుభ తెలంగాణ : పరిశ్రమల్లో పరిశుభ్రత పాటించాలని సుధాకర్ రావు అన్నారు. ఆర్జిఓసీఎం 1, ఆర్‌జి3 ఏరియా భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు బొగ్గు పరిశ్రమలలో పరిశుభ్రత పాటించాలనే తలంపుతో స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని రూపొందించి నిర్వహించడం జరుగుతుంది. సింగరేణి సంస్థ వ్యాప్తంగా కూడా ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 2వ తేదీ నుండి ప్రారంభించుకొవడం జరిగింది. అందులో భాగంగా గురువారం ఓసీ1 బేస్ వర్క్ షాప్ నందు స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఓసీ1 బేస్ వర్క్ షాప్ లో మొక్కలు నాటారు అనంతరం పరిసరాలను పరిశుబ్రపరిచారు. ఓసీ 1 ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్. రాధా కృష్ణ మాట్లాడుతూ... ఈ 15 రోజులే కాకుండా ప్రతి రోజు కూడా పరిశుభ్రతను విధిగా ఆచరించా లని తమ ఇంటిలో, ఆఫీసులో ఈ స్వచ్ఛ్ కార్యక్రమాన్ని చేపట్టి ఆరోగ్యకరమైయన సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు మాట్లాడుతూ... మహాత్మా గాంధీ స్వాంతంత్ర్యం కంటే పరిశు భ్రత ముఖ్యం అనేవారు అని గుర్తు చేశారు. దీనిని

అనుసరించి మన భారత ప్రభుత్వము స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని 30 రోజుల పాటు నిర్వహిస్తుందని అన్నారు. దీని ద్వారా బొగ్గు పరిశ్రమలలో అవగాహన తీసుకువచ్చి పరిశుభ్రమైన పని స్థలాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, పరిశుభ్రమైన పరిసరాలు నిర్మించుకుంటే అవే అభివృద్ధికి పునాదులౌతాయని ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ తమ పరిధిలో శుభ్రత పాటిస్తూ, పరిసరాలను కూడా శు భ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని హితవు పలికారు. స్వచ్ఛతా అనేది మన జీవన విధానంగా మారాలని అన్నారు. ప్రతి వ్యక్తి పరిశుభ్రత పాటించినట్లైతే తన కుటుంబంతో పాటు ఆ సమాజం / గ్రామం కూడా పరిశుభ్రంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడూ మనసు కూడా ఆహ్లాదకరంగా ఉంటుందని, పనిలో కూడా శ్రద్ధ పెరిగి ఎలాంటి పొరపాట్లకు ఆస్కారముండదని అభిప్రాయపడ్డారు. ఓసీ 1 ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్.రాధా కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఓటుజీఎం శ్రీ జి. రఘుపతి, మేనేజర్ ఉదయ్ హరిజన్, ఐఎన్‌టియూసి పిట్ సెక్రెటరీ సదానందం, ఏఐటియూసి పిట్ సెక్రెటరీ రమేష్, ఏరియా ఎన్విరాన్మెంట్ అధికారి పి.రాజా రెడ్డి, డివైఎస్ఈ సివిల్ రాజేంద్ర ప్రసాద్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఫారెస్ట్ అధికారి కల్యాణ్, ఓసీ 1 ఎన్విరాన్మెంట్ అధికారి కిషన్, బేస్ వర్క్ షాప్ హెచ్ఓడి జివి సత్యనారాయణ, సంక్షేమ అధికారి సాయికృష్ణ ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫార్మాలో ఒక్క రైతును నష్టపోనివ్వం

రంగారెడ్డి, శుభ తెలంగాణ : మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం ఫార్మా సిటీలో భూములు కోల్పోయిన రైతులకు అందరికీ న్యాయం చేస్తామని మరోసారి స్పష్టం చేశారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. వీరితో పాటు రావిర్యాల - జెన్నాయిగూడ రైతులు సైతం కేఎల్ఆర్ ను తుక్కుగూడ కార్యాలయంలో కలిశారు. అధికారులు, స్థానిక నాయకులతో చేర్చించి... ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారం, గతంలో ఇచ్చిన పట్టాలు, అభివృద్ధిపై పేదలకు భరోసా ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎవరైనా... ఇల్లీగల్ గా స్థలాలు పొందినా వారిని గుర్తించి లిస్ట్ నుంచి తొలగించాలని కేఎల్ఆర్ తెలిపారు. 20 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న జెన్నాయిగూడ భూనిర్వా సితులకు ఒకే చోట ప్లాటింగ్ చేసి ఇచ్చేలా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని కిచ్చెన్నగారు హామీ ఇచ్చారు. కందుకూరు మండలం 4 గ్రామాల్లో ఫార్మాలో భూములు కోల్పోయిన వారికి ఫ్లాట్లు - పరిహారం వచ్చేలా చూడాలని కాంగ్రెస్ నేత దేప భాస్కర్ రెడ్డికి సూచించారు. అందుకు సంబంధించిన

లీగల్, ప్రభుత్వ పరమైన సమస్యలపై దృష్టి పెట్టి ఫార్మా రైతులకు అండగా ఉండాలని బొక్క జంగారెడ్డికి చెప్పారు. అనంతరం వివిధ సమస్యలపై వచ్చిన నియోజకవర్గం ప్రజలతో మమేకం అయ్యారు కేఎల్ఆర్. సమస్యలు లేని మహేశ్వరం కావాలని లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు.

ప్రశాంతమైన వాతావరణంలో

దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి

పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

సిద్దిపేట, శుభ తెలంగాణ : అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించాలి జిల్లాలో దుర్గామాత మండపాలు ఏర్పాటు చేసే ఆర్గనైజర్ లకు, మండపాల నిర్వాహకులకు, కార్యవర్గ సభ్యులకు పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, పాటించవలసిన నియమ నిబంధనల గురించి తగు సూచనలు చేశారు.జిల్లాలో మొత్తం దుర్గామాత విగ్రహాలు 664, ఏర్పాటు చేయడం జరిగింది. దుర్గామాత ప్రతిష్టచాలనుకునే వారు సంభందింత పియస్ నుండి అనుమతి తీసుకోవాలి. ఎలక్ట్రిసిటి డిపార్ట్మెంట్ వారి పర్మిషన్ తీసుకుని కరెంటు వాడాలి దుర్గామాత మండపం రోడ్డు ప్రక్కన గాని ఖాళీ స్థలంలో గాని నిర్మించాలి. విగ్రహం యొక్క స్టేజి కింద ఎలాంటి వస్తువులు ఉంచరాదు మండపాల వద్ద తగినంత సంఖ్యలో స్థానిక సత్ప్రవర్తన కలిగిన వాలంటీర్లను నియమించి వాడు భక్తులను క్రమబద్ధీకరించే విధంగా చూడవలెను. దుర్గామాత మండపాలను మంచి నాణ్యత కలిగిన వస్తువుల తో ఏర్పాటు చేయవలెను మండపం మూడు వైపులా టార్పాలిన్ తో కప్పవలెను. మండపాలకు నాణ్యత కలిగిన వైరుతో కరెంట్ కనెక్షన్ ఇవ్వవలెను. వివాదాస్పద ప్రదేశాలలో మండపాలు ఉండకూడదు. ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం కలిగించరాదు.

డిజిటల్ కార్డు సర్వేను సక్రమంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి, శుభ తెలంగాణ : డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం గణపురం మండలం బుర్రకాయల గూడెంలో జరుగు తున్న డిజిటల్ కార్డు సర్వే ప్రక్రి యను గురువారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు, గణపురం మండలంలోని బుర్రకాయలగూడెం గ్రామాన్ని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో జరుగుతున్న సర్వే ప్రక్రియ పర్యవేక్షణకు నోడల్ అధికారిగా ఆర్డిఓ మంగిలాల్ ను నియమించామని తెలిపారు. మున్సిపల్, బుర్రకాయలగూడెం లలో జరుగుతున్న సర్వే ప్రక్రియ కు రెండు టీములు ఏర్పాటు చేశామని, ప్రతి టీముకు ముగ్గురు సిబ్బందిని నియమించి నట్లు తెలిపారు. అవసరం మేరకు సర్వేకు అదనపు టీములు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ పద్ధతిన అమలు చేయనున్న కుటుంబానికి డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియలో కుటుంబం యొక్క సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని అన్నారు. ప్రతి ఒక్క కుటుంబం వివరాలు డిజిటల్ కార్డు సర్వేలో తప్పకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సర్వేకు కావలసిన నోడల్ అధికారి బృందాల పనితీరును పర్యవేక్షణ చేయాలని అన్నారు. కుటుంబ గుర్తింపు కోసమే ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందని, దీనిలో భాగంగా కుటుంబంలో ఎంత మంది ఉన్నారు, వారి సమగ్ర వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఒక రాష్ట్రం ఒక కార్డు ద్వారా ప్రతి కుటుంబానికి రాష్ట్రంలో ఒక గుర్తింపు ఉంటుందని తెలిపారు. కుటుంబంలోని ఎక్కువ వయసు కలిగిన మహిళలు కుటుంబ పెద్దగా ఉంటారని అన్నారు. దీంతో పాటు ఇతర కుటుంబ సభ్యులకు కూడా గుర్తింపు సంఖ్య ఉంటుందని తెలిపారు. కుటుంబ వివరాలతో పాటు కొత్తగా కుటుంబంలోకి వచ్చిన వారు, జన్మించిన పిల్లల వివరాలను పొందుపరచడంతో పాటు చనిపోయిన, వివాహం చేసుకొని వెళ్లిన వారి వివరాలను తొలగించాలని అన్నారు. కుటుంబ సభ్యుల అనుమతితో గ్రూప్ పరిధిలోని కుటుంబాల సంఖ్య ఆధారంగా ఫోటోలు తీయాలని అన్నారు. సర్వే బృందాలు కుటుంబాలు సర్వే పూర్తి చేయుటకు ప్రణాళికలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఐదు రోజుల్లో కుటుంబ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే బృందాలకు కుటుంబం యొక్క సమగ్ర వివరాలు అందచేయాలని సర్వే ప్రకీయకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి ఆర్డిఓ మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

బుడగ జంగాల కాలనీకి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రణవ్

హుజురాబాద్, శుభ తెలంగాణ:

మాట ఇవ్వడమే కాదు దాన్ని నిలబెట్టుకున్నప్పుడే నిజమైన లీడర్ అవుతాడని దానికి తగ్గట్టుగా పని చేసిన పెట్టిన హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వోడితల ప్రణవ్ గతంలో వర్షాలు కురిసినప్పుడు వరద ప్రవాహం అంతా హుజురాబాద్ పట్టణంలోని గాంధీనగర్ లోని బేడ బుడగ జంగాల కాలనీ లోని గృహాలకు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇట్టి విషయం తెలుసుకున్న ప్రణవ్ అక్కడ నివసించే ప్రజలు మా కాలనీ యొక్క అవస్థలు చూడమని తెలుపగా స్పందించిన త్వరలోనే మీ కాలనీకి తగిన సాయం చేస్తాననిమాట ఇవ్వడం జరిగింది.ఇచ్చిన మాట ప్రకారం బుధవారం రోజున ఆ కాలనీలో మొరం పోయించి చదును చేపించారు. భారీ వర్షాలు కురుసిన ప్రతీ సమయంలో కాలనీ అస్తవ్యస్తం అవుతుందని,ఇన్నాళ్లుగా తమ కాలనీనీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడనీ, సమస్య చెప్పిన కొద్దిరోజుల్లోనే పరిష్కారం కృషి చేసినందుకు కాలనీవాసులు జీవితాంతం రుణపడి ఉంటామని అంటున్నారు. రాజకీయాలకతీతంగా సమస్యల పరిష్కార విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఇలాగే కొనసాగి మా సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కొన్నేళ్లుగా పరిష్కారం కానీ సమస్యలను కూడా మానవతా దృక్పథంతో చేస్తున్నాడని పలువురు కాలనీ వాసులు అభిప్రాయప డుతున్నారు.

బేగంపేటలో అధికారుల పర్యటన

కమాన్ పూర్, శుభ తెలంగాణ :

రామగిరి మం డలం బేగంపేటలో గురువారం ఆయా విభాగాల అధికారిలు పర్యటించారు. గ్రామానికి చెందిన దాసరి శివ ఫిర్యాదు మేరకు కమ్మరివాడలో పర్యటించిన అధికారులు మురుగునీటి కాల్వపై నెలకొన్న వివాదం గురించి ప్రజలతో మాట్లాడారు.ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపైన కఠిన చర్యలుంటాయని కాలువ నుండి మురుగుననీరు బయటకు వెళ్లకుండా ఆటంకపరిచేవారికీ గ్రామపంచాయతీ నుండి నోటీసులు పంపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డి.ఎల్.పివో సతీష్ హెచ్చరించారు.ఐదు రోజుల్లో డ్రైనేజీ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు.అనంతరం గ్రామంలోని బొంతలవాడతో పాటు ఇతర వార్డులను సందర్శించారు సమస్యలను పరిష్కారించాలని సూచించారు.కార్యక్రమంలో మండల తహసీల్దార్ రాంచందర్ రావు ఎంపివో ఉమేష్ కార్యదర్శి రత్నాకర్ లు పాల్గొన్నారు.

కళ్ళు బాగా కనిపించాలి అంటే ఈ పండ్లను తినాల్సిందే!



ఇటీవల కాలంలో డిజిటల్ వాడకం విపరీతంగా పెరిగిపోవడంతో చాలామంది కంటికి సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారు. మరి ముఖ్యంగా చిన్న వయసులోనే కంటి చూపు సమస్యను కోల్పోవడంతో పాటు కళ్లద్దాలు బానిసలు అయిపోతున్నారు. పదేళ్ల పిల్లవాడి నుంచి ఈ కళ్లద్దాల సమస్య మొదలవుతుంది. అందుకు గల కారణం పిల్లలకు టీవీలో, లాప్టాప్ లు స్మార్ట్ ఫోన్ లను ఇష్టం వచ్చినట్టుగా ఇవ్వడమే. క్రమంగా ఒక వయసు వచ్చేసరికి ఈ పిల్లలు కంటి చూపు ను కోల్పోతున్నారు. దీంతోపాటు కొందరు పోషకాహార లోపం వల్ల కూడా కంటిచూపుతో బాధపడుతున్నారు. అయితే ఈ కంటికి సంబంధించిన సమస్యలు రాకుండా ఉండాలంటే కొన్ని రకాల ఆహార పదార్థాలు తీసుకోవాల్సిందే అంటున్నారు నిపుణులు. మరి ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలి అన్న విషయానికి వస్తే.. మారుతున్న జీవన శైలి, పని ఒత్తిడి, గంటల తరబడి ఫోన్, ల్యాప్ టాప్ ను చూడటం వల్ల నేడు చాలా మంది కళ్ల జోళ్లను వాడుతున్నారు. ఒక వయస్సు తర్వాత కళ్లు బలహీనపడతాయి. ఈ కారణంగానే కళ్లజోడును ధరించాల్సి వస్తుంది. కానీ పోషకాల లోపం వల్ల నేడు చిన్న పిల్లలు కూడా కళ్లజోళ్లను వాడుతున్నారు. మరి ఆ అవసరం రాకుండా ఉండాలి అంటే తినాల్సిన వాటిలో కివి పండు కూడా ఒకటి. ఈ పండును తింటే మీ కంటి చూపు పెరుగుతుందట. వయసు పై బడిన తర్వాత కంటి చూపు తగ్గిపోతూ ఉంటుంది. అందుకే ఈ పండును తినడం వల్ల కంటిచూపు తగ్గే అవకాశం ఉండదు. కివిలు మన కళ్లకు మంచివి. ఈ పండులో జియాక్సంతిన్, లుటిన్ అనే వర్ణద్రవ్యాలు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి మన కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయట. కంటిచూపు తగ్గకుండా కాపాడుతాయని చెబుతున్నారు. అంతేకాకుండా ఈ పండులో యాంటీ ఆక్సిడెంట్స్ కూడా పుష్కలంగా ఉంటాయని చెబుతున్నారు. అలాగే బొప్పాయి పండు కూడా ఇందుకు ఎంతో బాగా ఉపయోగపడుతుంది. ఈ పండు కంటి సమస్యలను రాకుండా చేస్తాయి. బొప్పాయిలో విటమిన్ ఎ, విటమిన్ సి వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అంతేకాదు ఈ పండులో యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు కూడా ఉంటాయి. ఇవి మన కంటిచూపును పెంచుతాయని చెబుతున్నారు. అవొకాడో కూడా మన కంటి ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ పండులో విటమిన్ సి, విటమిన్ ఇ, విటమిన్ బి 6, ఫోలేట్, మెగ్నీషియం, పొటాషియం వంటి ఎన్నో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే ఈ పండు మన కంటిచూపును పెంచడానికి సహాయపడతాయట. ఉసిరి కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే జుట్టుకు సంబంధించిన సమస్యలకు కూడా ఎంతో బాగా ఉపయోగపడుతుంది. ఉసిరి కంటికి కూడా ఎంతో మేలు చేస్తుందట. ఉసిరిలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. ఉసిరిలో ఉండే విటమిన్ సి కంటి సమస్యలను తగ్గించడానికి కూడా సహాయపడుతుంది. ఇది కళ్లలోని రెటీనా కణాలను బలంగా చేస్తుందని చెబుతున్నారు.

పరిగడుపున కరివేపాకు నీళ్లు తాగితే ఏం జరుగుతుంది?

మన ఇంట్లో అలాగే పెరట్లో దొరికే ఆకుకూరల్లో కరివేపాకు కూడా ఒకటి. కరివేపాకును మనం ఎన్నో రకాల కూరలు ఉపయోగిస్తూ ఉంటాం. కూరకు రుచిని పెంచడంతోపాటు ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. కానీ చాలామంది కూరలో కరివేపాకే కదా అని తీసి పక్కకు పారేస్తూ ఉంటారు. కరివేపాకు తినడానికి అస్సలు ఇష్టపడరు. అయితే చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే కరివేపాకు వల్ల ఎన్నో రకాల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయట. ముఖ్యంగా పరగడుపున కరివేపాకు నీళ్లు తాగడం వల్ల మరిన్ని ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని చెబుతున్నారు. ఉదయాన్నే పరగడుపున కరివేపాకు నీళ్లు తాగితే ఏం జరుగుతుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. కరివేపాకుతో పాటుగా కరివేపాకు నీరు కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మన శరీరం ఫిట్ గా ఉండాలంటే మన జీర్ణక్రియ ఆరోగ్యంగా ఉండాలి. అయితే కరివేపాకులో మన జీర్ణశక్తిని పెంచే కొన్ని ఎంజైములు పుష్కలంగా ఉంటాయి. అయితే ప్రతిరోజూ ఉదయం కరివేపాకు నీటిని తాగితే ప్రేగు కదలికలు సులభతరం అవుతాయి. అలాగే జీర్ణక్రియకు సంబంధించిన సమస్యలు కూడా దూరమవుతాయని చెబుతున్నారు. అలాగే ప్రస్తుత రోజుల్లో ఒత్తిడి అన్నది సాధారణ సమస్యగా మారిపోయింది. చాలామంది ఒత్తిడి కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒత్తిడి మానసిక ఆరోగ్యాన్నే కాదు శారీరక ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది. అయితే కరివేపాకు ఈ ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించడానికి సహాయపడుతుంది. కరివేపాకు నీటిని తాగడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుందట. దీంతో మీరు ఎలాంటి ఒత్తిళ్లకు గురికారని చెబుతున్నారు. కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన

శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి సహాయపడతాయి. కరివేపాకు నీటిని క్రమం తప్పకుండా తాగడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీంతో మీకు గుండెజబ్బులు వచ్చే ముప్పు చాలావరకు తగ్గుతుందని చెబుతున్నారు. కరివేపాకు డయాబెటిస్ పేషెంట్లకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతి రోజూ ఉదయాన్నే కరివేపాకు నీటిని తాగితే బ్లడ్ లో షుగర్ కంట్రోల్ లో ఉంటుందట.

ఈ ఆకులో వ్యాధులకు ఔషధం ఉంటుంది..!

ఉసిరికాయలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని, రోజూ యాపిల్ తినలేని వారు ఉసిరికాయను తినాలని నిపుణులు చెబుతున్నారు. ఉసిరి వంటి దాని ఆకులు శరీరానికి చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయని మీకు తెలుసా? ఉసిరి ఆకులు వివిధ వ్యాధులను నయం చేయడంలో ఔషధంగా పనిచేస్తాయి. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పేగుల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. గూస్బెర్రీ ఆకులు కఠినమైనవి, కొద్దిగా తీపి పదార్థాన్ని కలిగి ఉంటాయి. ఆయుర్వేదం ప్రకారం, మన శరీరంలో వాత, పిత్త , కఫం అనే 3 రకాల దోషాలు ఉన్నాయి. ఈ దోషాలకు ఉసిరి ఆకు మందు అని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. ఐతే ఈ ఆకు తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటి? ఇక్కడ సమాచారం ఉంది. సాధారణంగా ఉసిరి ఆకులను పప్పులు లేదా పల్యాలలో ఉపయోగించవచ్చు. అంతే కాకుండా వాటిని పౌడర్‌గా చాలా రకాలుగా ఉపయోగించవచ్చు. ఈ ఉసిరి ఆకులు రక్త రుగ్మతలు, మంట, మలేరియా , మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు వంటి 120 వ్యాధులకు ఉపయోగపడతాయని చెబుతారు. ఉసిరి ఆకులను పొడి చేసి తింటే పొట్టలో పుండ్లు తగ్గుతాయి. ఉసిరి ఆకుల్లో ఉండే యాంటీ-ఆక్సిడెంట్ , యాంటీ వైరల్ గుణాలు లివర్ డ్యామేజ్‌ను నివారిస్తాయి. ఇవి శరీరాన్ని హానికరమైన ఉత్పత్తుల నుండి రక్షించడానికి సహాయపడతాయి. కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది. ఇవి ఫ్రీ రాడికల్స్ నుండి కాలేయ కణాలను రక్షిస్తాయి. అమ్లా ఆకులు జీర్ణవ్యవస్థకు ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి దాహం తగ్గించి, జీర్ణ క్రియను మెరుగుపరుస్తాయి. ఉసిరి ఆకుల పొడిని తీసుకోవడం వల్ల దగ్గు, కఫం, జ్వరం వంటి లక్షణాల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉసిరి శరీరంలో రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. కిడ్నీలో రాళ్లతో బాధపడేవారికి ఈ ఆకు దివ్యౌషధం. అలాంటివారు ఉసిరి ఆకుల పొడిని వివిధ రకాలుగా తీసుకోవచ్చు. అంతే కాకుండా పిత్తాశయ రాళ్లను నివారించడంలో ఈ ఆకులు ప్రభావవంతంగా పనిచేస్తాయి. అమ్లా ఆకులు రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచటానికి సహాయపడతాయి, ఇది ఊటను మెరుగుపరుస్తుంది.

ఉదయాన్నే లేవగానే వికారంగా అనిపిస్తుందా..?

చాలా మందికి ఉదయం నిద్ర లేవగానే ఖాళీ కడుపుతో వాంతులు అవుతున్నట్లు అనిపిస్తుంది. ఈ వ్యక్తులలో కొందరు వాంతులు చేసుకుంటారు. కొందరు ఆ అనుభూతిని అనుభవిస్తారు. అప్పుడప్పుడు ఇలా జరిగితే అది మామూలే. కానీ ప్రతిరోజు ఇలాగే జరిగితే ప్రమాదమని వైద్యులు సూచిస్తున్నారు. మీరు మీ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ఇది మీకు ఒక రకమైన సంకేతం. సాధారణంగా ఇది పేలవమైన జీర్ణక్రియ కారణంగా లేదా కొన్ని అనారోగ్యకరమైన ఆహారాన్ని తిన్న తర్వాత అనుభూతి చెందుతుంది. ఇలా రోజూ జరుగుతుంటే జాగ్రత్తగా ఉండాలని, ఇది ఈ వ్యాధుల సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీరు ఎక్కువసేపు ఆకలితో ఉంటే శరీరంలో రక్తంలో చక్కెర స్థాయి పడిపోతుంది. రక్తంలో చక్కెర స్థాయి తగ్గడం వల్ల కళ్లు తిరగడం, వాంతులు అవుతాయి. దీనిని హైపోగ్లైసీమియా అని కూడా అంటారు. దీన్ని నివారించడానికి మీరు ఉదయాన్నే నిద్రలేచి కొంత వ్యాయామం చేయాలి. ఆపై అల్పాహారం తీసుకోవాలి.మీరు తలనొప్పి సమస్యలతో బాధపడుతుంటే లేదా మైగ్రేన్ వ్యాధిగ్రస్తులైతే.. మందులు తీసుకుంటే మీరు ఇప్పటికీ ఉదయం అనుభూతి చెందవచ్చు లేదా వాంతి చేయవచ్చు. ఒత్తిడి, ఆందోళనతో బాధపడుతున్న వ్యక్తులు కూడా ఉదయం వికారంగా అనిపించవచ్చు. వీటిలో ఉదయం వాంతులు రావడానికి ప్రధాన కారణం తలనొప్పి. మీ కడుపులో వాపు లేదా గ్యాస్ ఏర్పడినట్లయితే మీరు ఉదయం మేల్కొన్న తర్వాత వాంతులు కూడా చేయవచ్చు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ సమస్యలు పెరుగుతాయి. అందువల్ల వాంతులు సంభవించవచ్చు. ఇందులో ఉదయం పూట వాంతులతోపాటు తలతిరుగుతున్నట్లు అనిపిస్తే తగిన మోతాదులో నీళ్లు తాగాలి. అదనంగా



రాత్రిపూట గ్యాస్‌కు కారణమయ్యే ఆహార పదార్థాలను తీసుకోవడం మానుకోవాలి. ఇది కాకుండా నిర్జలీకరణం, నిద్ర లేకపోవడం లేదా భారీ ఆహారం తినడం వల్ల కూడా ఇది



చెవినొప్పితో ఇబ్బందిపడుతున్నారా!

మామూలుగా అప్పుడప్పుడు మనకు చెవి నొప్పి సమస్యలు ఇబ్బంది పెడుతూ ఉంటాయి. చెవిలో చీము కారడం, చెవి నొప్పి, చెవి పోటు, చెవులు సరిగా వినిపించకపోవడం ఇలా ఏదో ఒక సమస్య వస్తూ ఉంటుంది.ఇలాంటి సమయంలో చాలామంది డాక్టర్ను సంప్రదిస్తే మరి కొంతమంది సొంత నిర్ణయాలు తీసుకుని ట్రీట్మెంట్ చేసుకుంటూ ఉంటారు. అయితే చెవి నొప్పి సమస్యలకు ఇంటి చిట్కాలలో భాగంగా వెల్లుల్లి చాలా బాగా పనిచేస్తుందని చెబుతున్నారు. మరి వెల్లుల్లితో ఏం చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. చాలా సందర్భాలలో చెవి నొప్పి జలుబు, రద్దీ అలాగే చెవి నుండి ద్రవాలు కారడం వలన వస్తుంది. ఇటువంటి సమయాలలో మందులు తీసుకోవడం కంటే నొప్పిని తగ్గించడానికి ఇంటి నివారణ ఉత్తమం. ఇందుకోసం వెల్లుల్లి ఉత్తమమైన ఎంపిక. వెల్లుల్లి బలమైన యాంటీ బ్యాక్టీరియా లక్షణాలను కలిగి ఉంటుంది. అలాగే ఇది ఇన్ఫెక్షన్ తో పోరాడుతుంది. అలాగే ఈ యాంటీ ఇన్ఫ్లమేటరీ ఏజెంట్ గా కూడా పని చేస్తుంది. ఇది చెవిలోని ద్రవాల పారుదలను నిరోధిస్తుంది. ముందుగా వెల్లుల్లిని మెత్తని చూర్ణం చేయాలి. ఆ చూర్ణాన్ని కాటన్ బట్టలో చుట్టి చిన్న బాల్ లా తయారు చేయాలి. దీనిని నొప్పి తో బాధపడుతున్న చెవిలో చూపించండి. మరీ లోతుగా కాకుండా చెవి లోపల పెట్టి 15 నిమిషాలు అలాగే ఉంచాలి. దీనివలన చెవి నొప్పి నెమ్మదిగా ఉపసమిస్తుంది. అలాగే చెవి నొప్పికి వెల్లుల్లి నూనె కూడా బాగా పనిచేస్తుంది. అలాగే వెల్లుల్లి రెబ్బలను చూర్ణం చేసి వెచ్చని ఆలివ్ నూనెతో కలపాలి. ఆ మిశ్రమాన్ని అరగంట పాటు అలాగే ఉంచాలి. ఆపై దానిని వడకట్టి నొప్పితో ఇబ్బంది పెడుతున్న చెవి రంధ్రంలో కొన్ని చుక్కలు వేయాలి. ఒకప్పుడు పెద్దలు ఈ రెమిడిని ఎక్కువగా వినియోగించేవారు. ఇలా చేస్తే నొప్పి నుంచి త్వరగా ఉపశమనం పొందవచ్చు. నొప్పి అలాగే వాపు నుంచి ఉపశమనం కోసం రోజుకి రెండు మూడు సార్లు ఇలా చేయడం మంచిది. దీనివలన చెవి నొప్పి క్రమేణా తగ్గుతుంది. మరొక పద్ధతిలో ఒక టేబుల్ స్పూన్ కొబ్బరి నూనెలో మెత్తగా తరిగిన వెల్లుల్లి రెబ్బలు రెండు నిమిషాలు వేడి చేసి, ఈ సారంలోని కొన్ని చుక్కలను మీ చెవిలో వేయాలి. ఇలా చేయటం వలన కూడా మీ చెవి నొప్పి చాలావరకు తగ్గుతుంది. నొప్పి భరించలేనిదిగా ఉన్నప్పుడు మాత్రం ఈ ఇంటి పద్ధతులు పాటించకుండా వైద్యుడిని సంప్రదించటం మంచిది.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110